క్లుప్తంగా

అధికారులతో ప్రత్యేక సమావేశం

పెనుగంచిప్రోలు:అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమానికి సంబంధించి మండల ప్రత్యేకాధికారి మోహన్ సందీప్ ఆధ్వర్యంతో సోమవారం మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సందీప్ అధికారులకు ఆస్పిరేషనల్ బ్లాక్ కింద చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఇందిర, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు సుందరరామయ్య, నరసింహారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఆటోడ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్‌ఐ కృష్ణబాబు సూచించారు. చిల్లకలులో సోమవారం ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ కృష్ణబాబు మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కిస్తే ప్రమాదాల తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్ధరాత్రి సమయంలో తిరిగే ఆటోడ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులను గమనిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రామిరెడ్డిపల్లిలో ఇంటింటికి బాలయేసు



నందిగామ: మండలంలోని రామిరెడ్డిపల్లిలో సోమవారం రాత్రి ఇంటింటికి బాలయేసు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలోని సిఎస్‌ఐ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇంటింటికి బాలయేసు కార్యక్రమాన్ని చేపట్టగా, ప్రతి ఇంటి వద్ద బాలయేసుకు స్వాగతం పలికారు. సిలువ గిరి విచారణ కర్త మోజేష్ రాజు, పాస్టర్ రాంబాబు, పెద్ద సంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందిపెట్టే మిల్లర్లపై చర్యలు తప్పవు

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట):ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు తప్పకుండా నిబంధనలను పాటించాలని తహసీల్దార్ సూర్యారావు ఆదేశించారు. అనుమంచిపల్లిలో ఉన్న పద్మావతి రైస్‌మిల్లును సోమవారం ఆయన సందర్శించారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో మిల్లర్లు, రైతులను ఇబ్బందిపెట్టవద్దన్నారు. రైతులను ఇబ్బందిపెట్టినట్లు తమ దృష్టికి వస్తే మిల్లర్లపై చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ వెంట వీఆర్వోలు, వ్యవసాయాధికారులు ఉన్నారు.

కోటి దీపాల కాంతులు

నందిగామ: కార్తీకమాస సోమవారం నందిగామ పట్టణం కోటి దీపాల కాంతులతో విరాజిల్లింది. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలోని కెవీఆర్ కళాశాల ప్రాంగణంలో కనులపండువగా సాగిన కోటి దీపోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని వాసవి మార్కెట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవ కార్యక్రమానికి బలుసుపాడులోని గురుధామ్ ధర్మక్షేత్ర వ్యవస్థాపకులు గెంటేల వెంకటరమణ, వసంత లక్ష్మి దంపతులు హాజరయ్యారు. శివలింగానికి పంచామృత అభిషేకాలు చేశారు.

సీసీరోడ్డుకు శంకుస్థాపన

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక రెండోవార్డులోని ఇండోర్ స్టేడియం వెనుక రూ 9.6లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వార్డు కౌన్సిలర్ కొలగాని రాము, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, తిరుమలరావు, మున్సిపల్ ఏఈ హనుమంతరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

జగ్గయ్యపేట అర్బన్: బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ డబ్బులను వసూలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పేట పట్టణ ఎస్‌ఐ ఆనందకుమార్ తెలిపారు. తనను యర్రంశెట్టి అంజనేయులు, ముత్యాల గోపి, ఉద్దగిరి గోపి అనే వ్యక్తులు బెదిరించి డబ్బులు వసూలు చేశారంటూ పేటకు చెందిన పి.భక్తవత్సలమూర్తం అనే వ్యక్తి ఈనెల 6వతేదీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు



విజ్ఞాననందీశ్వరుడికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నందిగామ: కార్తికమాస ఆఖరి సోమవారం కావడంతో భక్తులు శివాలయాల వద్ద బారులుతీరారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో వేకువజాము నుండే భక్తుల రాక ప్రారంభమైంది. ప్రత్యేక అభిషేకాల అనంతరం స్వామివారికి అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు చేశారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ఉన్న భక్తులు సాయంత్రం సమయంలో ఆలయానికి చేరుకొని కార్తికదీపాలు వెలిగించారు. అదేవిధంగా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కూడలి సంగమేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. పట్టణ శివారు పల్లగిరి గుట్టపై గల స్వయంభూ శివలింగం, రైతుపేట డౌన్ ప్రాంతంలోని విజ్ఞాన నందీశ్వరస్వామి వారి ఆలయం వద్ద భక్తులు స్వయంగా స్వామివారికి అభిషేకాలు చేశారు. కార్తిక సోమవారం నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



పెనుగంచిప్రోలులో ప్రత్యేకాలంకరణలో స్వామివారు

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు:కార్తికమాసం చివరి సోమవారం సందర్భంగా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో శివాలయాల్లో స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పెనుగంచిప్రోలులోని శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : కార్తిక మాస సోమవారం నేపథ్యంలో శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని గొట్టుముక్కలలో గంగాపార్వతి సమేత శంభులింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి భక్తులు పంచామృతాభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన గుదే చిన వెంటేశ్వరరావు సహకారంతో శంభులేశ్వరుడికి లక్ష బిల్వార్చన పూజలు చేశారు. కంచికచర్లలో పాత శివాలయం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, రామాలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పరిటాల, కునికెనపాడు, మున్నలూరు, చెవిటికల్లు, మోగులూరు, వేములపల్లి, కీసర తదితర గ్రామాల్లో ఆలయాలకు భక్తులు తెల్లవారుజామునుంచే తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించి పూజలు చేశారు. మద్దులమ్మ తల్లి ఆలయం వద్ద భక్తులు ప్రభలతో ఊరేగింపుగా వెళ్లి పాలపొంగళ్లు సమర్పించారు.



గొట్టుముక్కలలో స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు



నందిగామలోని రామలింగేశ్వరస్వామి వారికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నందిగామ టౌన్: కులం, మతం, పార్టీ, ప్రాంతం చూడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డులో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని ప్రతిగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగా పార్టీవారికి, నాయకులు సూచించిన వారికే సంక్షేమ పథకాలు అందించకుండా అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తూ అవినీతికి తావు లేని పారదర్శక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ మనసున్న ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. అట్టడుగు వర్గాలకు సైతం కేబినెట్‌లో స్థానం కల్పించి సముచిత గౌరవం ఇచ్చారని చెప్పారు. ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మద్దతు పలికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండారు గంగమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు బండారు వెంకట్రావ్, షేక్ షరీఫ్, మందా మరియమ్మ, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని సబ్‌జైలును లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జగ్గయ్యపేట, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీల పరిస్థితిని ఆరాతీశారు. ఖైదీలకు అందుతున్న వసతి సౌకర్యాలు, ఆహారం ఏర్పాట్లను పరిశీలించారు. ఖైదీల కేసు వివరాలను జైలు సూపరిండెంట్‌ను అడిగితెలుసుకున్నారు. జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జైలు సూపరిండింటెంట్ ఎం.పట్టాభిరామన్న, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సందర్శన

రావిరాల(జగ్గయ్యపేట):జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించినవారు త్వరితగతిన పనులు పూర్తిచేసుకోవాలని ఆర్‌డీవో సాయిబాబు సూచించారు. రావిరాలలోగల జగనన్న కాలనీని సోమ వారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ లేఅవుట్‌లో ఇళ్లస్థలాలు మంజూరై పనులను ప్రారంభించనివారు వెంటనే ప్రారంభించాలని సూచించారు. తహశీల్దార్ సూర్యారావు, సర్వేయర్ అనూష్ పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరిస్తాం

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు అర్జీలు అందాయని తహశీల్దార్ పి. శంకరబాబు తెలిపారు. పరిటాల, కంచికచర్లలో స్థలాల విషయమై సర్వే చేసి హద్దులు వేయాలని రెండు అర్జీలు వచ్చినట్లు వివరించారు. అర్జీలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఏఓ కే విజయకుమార్, డీటీ నాగులమీరా, ఆర్‌ఐ సుబ్రహ్మణ్యం, ఏఎస్‌ఓ దుర్గాప్రసాద్, కోట భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): స్థానిక ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో మండలంలోని బలుసుపాడులో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సంఘస్తులు, ఆర్‌సీఎం సిస్టర్లు ఊరేగింపుతో ఇంటింటికి వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బాలయేసు ప్రతిమతో ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ తాత సందడి చేశారు. అనంతరం చర్చిలో జరిగిన పూజా కార్యక్రమంలో ఫాదర్ జె.జయరాజు ప్రసంగిస్తూ ఎదుటి వారిని ప్రేమించడమే క్రైస్తవత్వమని పేర్కొన్నారు. ప్రపంచం యావత్తు ఘనంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని కొనియాడారు.సెయింట్ ఆన్స్ హాస్పిటల్ సుపీరియర్ మేరీ ఆంటోని, సిస్టర్లు మేరీ, నిర్మల, అనిత, సంధ్య, చర్చిల ఉపదేశకులు అలోషియస్, చార్లెస్, ఫిలిప్, మధు, సంఘ పెద్దలు మేరీ వినీత, ఉప్పుతోళ్ల బాలస్వామి, కొరివి బాబురావు, గండమాల మాధవి, మరియదళ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఫాదర్ జయరాజు, సంఘస్తులు

కె.పొన్నవరంలో..

కె.పొన్నవరం(పెనుగంచిప్రోలు): మండలంలోని కె.పొన్నవరం గ్రామంలో సోమవారం రాత్రి ఎంపీపీ మార్కపూడి గాంధీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్రిస్మస్ పండుగ అందరికీ మేలు చేకూర్చాలని పాస్టర్లు పేర్కొన్నారు. కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి సీఎం జగన్ కృషి

కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి



పరిటాలలో గోడౌన్‌ను ప్రారంభిస్తున్న తాతినేని పద్మావతి, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పరిటాల(కంచికచర్ల) : రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి పేర్కొన్నారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుతో కలసి మండలంలోని పరిటాలలో రూ.25లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ గోడౌన్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని మాట్లాడుతూ రైతు సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. రైతులకు సేవలందించే సహకార సంఘాల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే కేడీసీసీ బ్యాంకులన్నీ లాభాల బాటలో నడుస్తున్నాయని గుర్తుచేశారు. అందుకే తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు ఇస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ నిత్యం రైతుల గురించే ఆలోచించే ఏకైక సీఎం జగన్ అని కొనియాడారు. రైతుభరోసా కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన అన్ని సేవలను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం రైతుల కోసం గోడౌన్ నిర్మాణంతోపాటు పీఏసీఎస్‌లకు నూతన భవనాలను నిర్మిస్తోందని వివరించారు. రైతులు పండించిన పంటలన్నీ ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ దీవించాలని కోరారు. అనంతరం కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పద్మావతిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, సొసైటీ అధ్యక్షుడు మాగంటి వినయభూషణరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, గనిఆత్కూరు సొసైటీఅధ్యక్షుడు పాటిబండ్ల హరిజగన్నాధరావు, కంచర్ల పద్మావతి, మార్త శ్రీనివాసరావు, ఏసుబాబు, జాన్‌బాబు, యద్దనపూడి విజయారావు, వేముల నాగరాజు, జమలయ్య, సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పచ్చ పత్రికలు విషప్రచారం మానుకోవాలి

విప్ ఉదయభాను



మాట్లాడుతున్న విప్ ఉదయభాను

వత్సవాయి(పెనుగంచిప్రోలు): వరదలపై పచ్చ పత్రికలు చేస్తున్న విషప్రచారం ఇకనైనా మానుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మంగొల్లులో సోమవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జగనన్న పాలనలో సచివాలయ పరిధిలో ప్రజలకు చేకూరిన లబ్దిని వివరిస్తూ ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఉదయభాను మాట్లాడుతూ వరదలపై టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారం దారుణంగా ఉందన్నారు. ప్రతి దానిని రాజకీయం చేయటం తగదన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మిల్లర్లకు ఇప్పటికే ఆదేశించినట్లు గుర్తుచేశారు. చంద్రబాబు, ఎల్లో మీడియా చెప్పే అబద్ధాల ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దన్నారు. పచ్చ పత్రికలు తప్పుడు రాతలు రాస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రమంతా వరదలు వస్తే ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో కాకుండా సైకిల్‌పై తిరుగుతారా? అని ప్రశ్నించారు. సర్పంచ్ అన్నెపాక రత్నకుమారి, ఎంపీపీ కె.రమాదేవి, సొసైటీ, గ్రామపార్టీ అధ్యక్షులు సామినేని లక్ష్మీనారాయణ, గుత్తా శంకరరావు, నాగేంద్రరెడ్డి, అన్నెపాక నరసింహారావు, శరణం కృష్ణారావు, మన్నె పాపయ్య, పాండురంగారావు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం..ఆంధ్రా

చందర్లపాడు(నందిగామ టౌన్): గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని నందిగామ డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయా సచివాలయాల సిబ్బందికి ఆడుదాం ఆంధ్ర కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఈనెల 15నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని కోరారు.ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, వైఎస్ఎస్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, కందుల నాగేశ్వరరావు, రాయల జానకి రామయ్య, అధికారులు పాల్గొన్నారు.



కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఆడుదాం..ఆంధ్రా కిట్ల పంపిణీ

పెనుగంచిప్రోలు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఆయా సచివాలయాలకు క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి మండలం నుంచి ఇప్పటివరకు 2071మంది క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోగా, ఆయా క్రీడలను తిలకించేందుకు 2079మంది ప్రేక్షకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఈనెల 13వతేదీ వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయని క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ సిద్దారెడ్డి, పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు, వైద్యాధికారి పి.ఇందిర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న ఎంపీపీ గాంధీ

స్పందనకు తొమ్మిది అర్జీలు

నందిగామ: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ తొమ్మిది మంది అర్జీలు అందజేసినట్లు ఆర్డీవో సాయిబాబు తెలిపారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కారిస్తామని ఆర్డీవో తెలిపారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిబాబు

మేలు చేస్తేనే ఓటెయమన్న సత్తా జగనన్నదే

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నరసింహారావుపాలెం(వీరులపాడు): తన పాలనలో మేలు జరిగితేనే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటేసి అండగా నిలవాలని ప్రజలను కోరుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని నరసింహారావుపాలెంలో సోమవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధివివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఆయా సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రప్రజలకు రూ.2.50లక్షల కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమచేశారని గుర్తుచేశారు. మా ప్రభుత్వం ఈ పనులు చేసింది..ప్రజలకు ఈ మేలు చేసిందని అంటూ డిస్‌ప్లే బోర్డులు పెట్టి మరీ చెబుతున్న దమ్మున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వరరావు,హుస్సేన్, ఎంపీడీవో అరుంధతీదేవి పాల్గొన్నారు.



నరసింహారావుపాలెంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

రాఘవాపురంలో..

నందిగామ టౌన్: నిరుపేదల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని రాఘవాపురంలో సోమవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెసరమల్లి సురేష్, నాయకులు స్టాలిన్, నెలకుదిటి శివనాగేశ్వరరావు వలంటీర్లు పాల్గొన్నారు.

13వవార్డు వాసులకు రూ.19కోట్ల లబ్ధి..

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకుందామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పిలుపునిచ్చారు. పట్టణంలోని 13వవార్డు సత్యనారాయణపురంలో సోమవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద ప్రభుత్వం పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన వివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును, ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరగాలంటే వైఎస్ జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సి ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రంలో ప్రతి ఇంటికి మేలు చేకూరిందని వివరించారు. 13వ వార్డు ప్రజలకు రూ.19కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, బద్దూనాయక్, ప్రశాంత్, వెంకన్న, సుజాత, నాయకులు పాల్గొన్నారు.



పేటలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, నాయకులు

ఓటర్ల జాబితాపై బీఎల్‌ఓలతో సమీక్ష

నందిగామ: నిర్దిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి బీఎల్‌వోలంతా క్రమశిక్షణతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆయన పట్టణంలోని బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్‌కేంద్రాల వారీగా వచ్చిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.